

ప్రభుత్వ హామీ అమలు ఏమైంది?

- గిట్టుబాటు ధర చెల్లించని ఫ్యాక్టరీలు
- ప్రభుత్వ తీరుపై మామిడి రైతుల ఆగ్రహం
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: సీజన్ మొదట్లో జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులతో చర్చలు జరిపి ఒప్పించామంటూ ప్రభుత్వమే తోతాపూరి రకం టన్నుకు రూ.8వేల ఇచ్చేలా నిర్ణయించి ఈ మేరకు ఫ్యాక్టరీల ఎదుట డిస్ప్లేబోర్డులు పెట్టిమరీ మామిడి సరఫరా చేయాలని సలహా ఇచ్చింది. తీరా సీజన్ ముగిసి బిల్లులు చెల్లించే సమయంలో ఫ్యాక్టరీ యజమానులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గిట్టుబాటు కావడం లేదంటూ ప్రభుత్వమే నాల్గు రూపాయలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ, అటు ఫ్యాక్టరీ యాజమాన్యం కేజీకి రూ.8 చెల్లించాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశం అమలు కాలేదని, చివరకు తాము పూర్తిగా నష్టపోయామని జిల్లాలోని మామిడి రైతులు మండిపడ్డారు.

'ప్రభుత్వ హామీ అమలు కాకుంటే ఎలా?' అంటూ సోమవారం చిత్తూరు మార్కెట్ యార్డు నుండీ కలెక్టరేట్ వరకు మామిడి రైతులు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. మామిడి రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జ్యూస్ ఫ్యాక్టరీ టన్నుకు రూ. 8వేలు ఇచ్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మామిడి రైతులను మోసం చేస్తూ రూ. 4,5,6 ఇచ్చి చేతులు దులుపుకొనే జ్యూస్‌ఫ్యాక్టరీలకు వచ్చే సీజన్‌లో మామిడి సరఫరా చేయమంటూ గ్రామాల్లో మామిడి రైతులు తీర్మానం చేశారు. అక్టోబర్ 2వ తేదీలోపు జ్యూస్ ఫ్యాక్టరీలు రూ. 8 చెల్లించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అసరమైతే జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటామని మామిడి రైతు సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. తమ పోరాటం ప్రభుత్వంతో కాదని మామిడి రైతులను ధగా చేస్తున్న ఫ్యాక్టరీలపైనే అన్నారు. ర్యాంపులు వద్ద ప్రభుత్వ అనుమతుల్ని అమలు చేయకుండా రైతులను నిలువునా ముంచారన్నారు. ర్యాంపుల వద్ద కేజీకి రూ. 3 మించి ఇవ్వడం లేదని ఏదిఏమైనా ప్రభుత్వం ప్రకటించిన మేరకు ఫ్యాక్టరీలు టన్నుకు రూ. 8 వేలు ఇచ్చేంత వరకు మామిడిరైతుల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు , మామిడి సంక్షేమ సంఘం నాయకులు జనార్ధన్, హేమలత, భారతి, ఆనందనాయుడు, హరిబాబుచౌదరిలతో పాటు రైతు సంఘం నాయకులు రామనాయుడుతో పాటు పెద్ద సంఖ్యలో మామిడి రైతులు పాల్గొన్నారు. మామిడి రైతుల పోరాటానికి సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు , జిల్లా నాయకులు బంగారు మురళి సంపూర్ణమద్దతు ప్రకటించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మామిడి రైతులు



బాధ్యతలు స్వీకరిస్తున్న చిత్తూరు ఎస్పి తుషార్ డూడి

ఎస్పి తుషార్ డూడి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఎస్పీగా తుషార్ డూడి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా పనిచేయడం, జిల్లా అంతటా గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిస్తామని పేర్కొన్నారు. పోలీసుల్లో వృత్తి నైపుణ్యత పెంచుతామని, కమ్యూనిటీ పోలీసింగ్ ను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

తుషార్ డూడి 2018 వ బ్యాచ్ కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్, గతంలో గ్రే హౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండెంట్‌గా, చింతపల్లి అదనపు ఎస్పీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్‌గా, వైఎస్ఆర్ కడప జిల్లా, గుంటూరు అర్బన్, గుంటూరు, ఎస్పీలుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా చిత్తూరు ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు, బాలికల రక్షణే ధ్యేయం



పోలీసుల వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పి

మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా పని చేస్తానని, జిల్లా అంతటా గంజాయి , డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనపై దృష్టి సారిస్తామన్నారు. జిల్లా పోలీసులకు వృత్తి నైపుణ్యత పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని, పోలీసు లపై ప్రజలకు నమ్మకం పెంచేలా ప్రజలకు చేరువ అయ్యేలా చేస్తామని, కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వం చొరవ చూపాలి

- ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి
- యుటిఎఫ్ రణభేరిలో మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయ సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించి, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చొరవ చూపాలని మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. యుటిఎఫ్ వివిధ ఉపాధ్యాయ, విద్యారంగ ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన రణభేరి ప్రచార బైక్ జాతా పలమనేరులో సోమవారం ప్రారంభమై చిత్తూరుకు చేరు కుంది.

ఈ జాతను ఉద్దేశించి విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా రంగంలో చేసిన ప్రయోగాలు దుష్పరిణామాలకు దారి తీయడంతో వాటిని సరిదిద్దాలని ఈ ప్రభుత్వానికి మొర పెట్టుకోగా, ఈ ప్రభుత్వం కూడా నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలను పునర్వ్యవస్థీకృతం చేయడం వల్ల పాఠశాల వ్యవస్థలో 9 రకాలైన పాఠశాలలు ఆవిర్భవించాయని ఫలితంగా అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని మూడు లక్షల మంది ప్రైవేటు పాఠశాలలకు వెళ్లారన్నారు. ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయ కుండా అనేక రకాల యాప్‌లతో ప్రభుత్వం వేధి స్తోందని, దీనివల్ల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం అవుతుండడం అన్యాయమన్నారు. బోధనేతర కార్యక్రమాలను తొలగిస్తామన్న ప్రభుత్వం ప్రస్తుతం ఏకంగా ఉపాధ్యాయులకు సంబంధం లేని అనేక కార్యక్రమాలను ఉపాధ్యాయుల వద్ద చేయిస్తున్న ఫలితంగా బోధన కుంటు పడు తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియమించిన పిఆర్‌సి కమిటీ నిర్వీర్యమైందని, ప్రస్తుత ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ కమిటీకి సంబంధించి ఎలాంటి పురోగతి లేదని, ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని నియమించడంతోపాటు, దాని రిపోర్టు వచ్చి అమలు జరిగే లోపు 29 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, జివి రమణలు మాట్లాడుతూ గత ప్రభుత్వం నుండి ఇప్పటివరకు నాలుగు విడతల కరువు భత్యం పెండింగ్‌లో వుందని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక పరమైన అంశాలు పెండింగ్ లేకుండా మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ హామీని నెరవేర్చుకోవాలని డిమాండు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 26 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. యుటిఎఫ్ చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమశేఖర్ నాయుడు, ఎస్ మణిగండన్ మాట్లాడుతూ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని, హక్కుల కోసం పోరాటంతో పాటు, బాధ్యతల కోసం నిజాయితీగా నిలబడి పిల్లల విద్యాభివృద్ధికి పాటుపడుతోందన్నారు. సోమవారం ప్రచార జాతా పలమనేరులో ప్రారంభమై నగరిలో ముగుస్తున్న సందర్భంగా పాల్గొంటున్న నాయకులు , కార్యకర్తలు అందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి ప్రారంభమైన ఈ రణభేరి ప్రచార బైక్ జాతాలో పందలాది ఉపాధ్యాయులు బైకులతో ర్యాలీ చేయడంతో పాటు, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని, బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని నినాదాలు ఇస్తూ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు రెడ్డప్ప నాయుడు, రెహనా బేగం, కోశాధికారి ప్రసన్నకుమార్ తో పాటు, ఎస్ పి బాషా జిల్లా కార్యదర్శిలు సిపి ప్రకాష్, కృష్ణమూర్తి, పంటపల్లి సురేష్, ఎం పార్థసారథి, ఏకాంబరం, సరిత, పి. సి బాబు, బివి రమణ, కె శేఖర్, ఎంసీ నిర్మల, యువరాణి, రాష్ట్ర కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాలెం: సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను కొనసాగించాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యుటిఎఫ్ 'రణభేరి'కి యుటిఎఫ్ మండల అధ్యక్షులు మహేష్ బాబు స్వాగతం పలికి సమావేశ నిర్వహించారు. యుటిఎఫ్ చేపట్టిన రణభేరికి విశేష స్పందన వస్తోందన్నారు అనంతరం ర్యాలీ చిత్తూరుకు వెళ్లింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జివి రమణ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి మణికంఠ, జిల్లా కార్యదర్శి సరిత, మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, యుటిఎఫ్ సభ్యులు సాంబశివ, గంటా మోహన్, మాధవ నాయుడు , విజయ్ కుమారి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయండి

- కలెక్టర్ల సమావేశంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఎస్‌సి, ఎస్‌టి హ్యాబిటేషన్స్‌ల అభివృద్ధికి ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ కింద నేరుగా నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై రెండు రోజులు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి రోజు కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్యమంత్రికి వివరిస్తూ జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి హ్యాబిటేషన్స్ లో రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రత్యేక అధికారులను నియమించి పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ కింద జిల్లాకు నేరుగా నిధులు సమకూరిస్తే ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు, తాగు నీటి సౌకర్యం వంటి అభివృద్ధి పనులు మంజూరు చేసి వేగ వంతంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు త్వరలో చేపడతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎఫ్ఆర్‌వో

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మండల పరిధిలో ఆరు ఏనుగులు సంచరిస్తున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుప్పం ఎఫ్ఆర్ఓ జయశంకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కుప్పం మండలం మోట్ల చేను, కూసూరు, అడవి ములకలపల్లి గ్రామాల పరిసరాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని రాత్రి వేళల్లో పంట పొలాల వద్దకు రైతులు వెళ్లకూడదని హెచ్చరించారు. ఏనుగుల గురించి తెలిస్తే వెంటనే ఫారెస్ట్ అధికారులకు 7981451575 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: సీడీపీవో



ప్రజాశక్తి -కార్వేటినగరం: విధి నిర్వహణలో సిబ్బం ది సమయ పాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట అంగన్ వాడీ కేంద్రాన్ని వారు సోమవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. సీడీపీవో మాట్లాడుతూ చిన్నారుల ఆలన పాలన పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి నెల పిల్లల బరువును పరిశీలించి వారికి కావాల్సిన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారంపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు వారికి చేరవేయాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ఆలస్యం అయినా, గ్రామస్తుల నుంచి సిబ్బందిపై ఫిర్యాదులు అందిన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారత 'కల' సాకారానికి..

కలిసి నడుద్దాం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: మహిళా సాధికారతతో లింగ సమానత్వం సాధ్యమని, రాజ్యాంగంలోనూ లింగ సమానత్వానికి ప్రాధాన్యత ఉందని జాతీయ సదస్సులో గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. సాధికారత కల సాకారానికి కలసి నడుద్దాం అన్నారు. మహిళలు చట్టసభల్లోకి వస్తే విధానపరమైన నిర్ణయాల్లో సమాన భాగస్వామ్యం ఉంటుందని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారత సదస్సు ముగింపు సమావేశానికి రాష్ట్ర గవర్నర్ రెండో రోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997, ఏప్రిల్ 29న 11వ లోక్‌సభలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత కమిటీ, దేశంలో మహిళా సాధికారతకు ఒక ప్రధాన మైలురాయిగా నిలిచిందన్నారు. ఈ కమిటీ చేసిన సూచనలు, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, సమాజంలో సార్వత్రిక మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. మహిళా సాధికారత అంటే కేవలం మహిళల కోసమే కాదని, అది సమాజమంతటికీ విముక్తి ప్రసాదించే వాగ్దానం అన్నారు. మహిళలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులకు దీటుగా నిలుస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పుల్లోనూ మహిళా హక్కులు కాపాడేలా అనుకూల తీర్పులు ఇచ్చిందని గుర్తు చేశారు. సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లన్నారు.

తిరుపతి సదస్సు చారిత్రిక ఘట్టం
హరివంశ్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ 1997లో ఏర్పాటైన మహిళా సాధికారత కమిటీ 28 సంవత్సరాల తరువాత మొదటిసారిగా ఇంత విస్తృత స్థాయిలో సమావేశం జరగడం చారిత్రక ఘట్టమన్నారు. ఒక మహిళ విద్యావంతురాలైతే ఒక తరం విద్యావంతమవుతుంది అని సావిత్రిబాయ్‌పూలే చెప్పిన మాటలు ఇప్పటికీ సత్యమేనన్నారు. రాజ్యాంగ సభలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా హక్కుల కోసం పోరాడి పురుషుల కంటే మంచి నిర్వాహకులు అని అపుడే నిరూపించారన్నారు.

చర్చలు బలమైన పునాది వేశాయి : పురందేశ్వరి, కమిటీ ఛైర్‌పర్సన్

మహిళా సదస్సులో గవర్నర్

తిరుపతి వేదికగా జాతీయ సదస్సు సక్సెస్

సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరి మాట్లాడుతూ జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్, కొత్తగా ఎదుగుతున్న టెక్నాలజీల సవాళ్లను ఎదుర్కోవడానికి మహిళలను సాధికారపరచడం అనే విషయం ప్లీనరీ సెషన్లలో జరిగిన చర్చలు లోతైన, దూరదష్టి గల ఫలితాలను ఇచ్చాయన్నారు.


మహిళా సాధికారత కలకాదు..సత్యం :
చింతకాయల అయ్యన్నపాత్రుడు, స్పీకర్

అందరం కలిసి నడిస్తే మహిళల సాధికారత కలకాదని, త్వరలోనే సత్యం అవుతుంది. రెండు రోజుల పాటు తొలి మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తవడంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు. చర్చలు, పంచుకున్న అనుభవాలన్నీ కలిపి కొత్త దిశ, కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. మహిళల సమానహక్కులు, రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో అవకాశాలు. ఇవన్నీ కేవలం నినాదాలు కావు, అందరం కలిసి సాధించాల్సిన లక్ష్యాలు..

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూళ్ళూరు పేట, పుట్టపర్తి జిల్లాల ఎమ్మెల్యేలు, నెలవల విజయశ్రీ, పల్లె సింధూరా రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, తిరుపతి బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినుతల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌యస్ కార్యక్రమం లో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన 339 అర్జీలను జెసి జి విద్యాదరి స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను జెసి ఆదేశించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాల పరిమితులలో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారు సంతృప్తి చెందేలా వేగంగా పరిష్కరించినప్పుడే అధికారులపైవిశ్వాసం కలుగుతుందన్నారు. మొత్తం 339 ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 261, పోలీస్ శాఖ 12, పంచాయతీరాజ్ 5, దేవాదాయ శాఖ 2, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ 5, విద్యా శాఖ 4, ఐసిడిఎస్ 2, డ్వామా 3, పౌర సరఫరాల శాఖ 5, డి ఆర్ డి ఏ 24, ఆర్ అండ్ బి 1, విద్యుత్ శాఖ 1 ఫిర్యాదు అందాయి. సర్వ శిక్ష అభియాన్ 2, కార్మిక శాఖ 1, పశుసంవర్ధక శాఖ 4, హార్టికల్చర్ 1, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 3, గ్రామీణ నీటి సరఫరా శాఖ 3, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ, డిప్యూటీ కలెక్టర్లకు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డిఆర్ఓ కె మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కుసుమ కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఆదర్శంగా కుప్పం ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణం

ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ మునిరత్నం



బస్టాండును పరిశీలిస్తున్న ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ మునిరత్నం

ప్రజాశక్తి-కుప్పం: రాష్ట్రానికి ఆదర్శంగా కుప్పం ఆర్టీసీ బస్టాండును ఆధునిక హంగులతో నిర్మించనున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం ఆర్టీసీ డిపో ప్రాంగణాన్ని సోమవారం ఆయన పరిశీలించి డిపో అధికారులతో సమావేశమయ్యారు. డిపోలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు సేవ పథకంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు మహిళల రాకపోకలు మరింత సులభతరం కావడానికి బస్సుల సంఖ్య ఫ్రీక్వెన్సీని అవసరమైతే పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. త్వరలోనే కుప్పం ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆధునిక బస్టాండ్ నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని త్వరలోనే ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు సైతం రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పి కె స్వామి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే చొరవకు విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం



తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే థామస్ దృష్టి సారిం చడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ పర్యటించారు. ఆ సమయంలో విద్యార్థులకు తాగునీరు సౌకర్యం లేదని సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన నూతన బోరు మంజూరు చేశారు. సోమవారం టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన బోరు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య యాదవ్, స్కూలు కమిటీ ఛైర్‌పర్సన్ భువనేశ్వరి, వైస్ ఛైర్మన్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యా యురాలు సుబ్బరత్నమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఉప సర్పంచ్ వెంకటపతి రెడ్డి, నాయకులు త్యాగరాజుల రెడ్డి, తుకారం రెడ్డి, జయరాం రెడ్డి, మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యూరియా కొరత.. తీరని వెత

- రైతుల నిరీక్షణ
- ఆచూకీ లేని అధికారులు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): యూరియా కొరత సమస్య రైతులను వెంటాడుతూనే వుంది. ఓ వైపు కేంద్రం నుంచి రాష్ట్రానికి వేల టన్నుల యూరియా బస్తాలు వచ్చినా రైతుల వెతలు తీరలేదు. మరో వైపు యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్న మాటలు నెరవేరడం లేదు.. పలమనేరు రూరల్ మండల పరిధిలో యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు, వెతలు వర్ణనాతీతం.. అయినా వ్యవసాయాధికారులు దీన్ని చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

యూరియా కొరత.. తీరని వెత

పలమనేరు రూరల్ మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు అరకొరగా వస్తున్న యూరియాతో అధికారులు ఎప్పుడు ఉంటారో ఎప్పుడు యూరియా అందిస్తారు? అనే ఆశతో ఎదురుచూసి విసిగి వెను తిరగాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వరి పంట ఎక్కువ కావడంతో చాలామంది రైతులు యూరియాపై ఆధారపడుతున్నారు. దీంతో పాటు పశుగ్రాసం కూడా యూరియా వేస్తేనే ఎదుగుతుందని అలాలేని పక్షంలో పశువులకు కావలసినంత పశుగ్రాసం రాదని రైతులు అంటున్నారు.

పలమనేరు మండల పరిధిలో 11 పంచాయతీలు, 11 సచివాలయాలు ఉన్నాయి. వందల ఎకరాల వరి సాగుకు నీరు ఉన్నా ఎరువుల కొరత సమస్య రైతులను వేధిస్తోంది. అధికారులను అడుగుదామంటే వారి ఆచూకీ లేదని రైతులు పేర్కొంటున్నారు.

ఆచూకీ లేని అధికారులు

ప్రతి సచివాలయ పరిధిలో అగ్రికల్చర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తారు. వారు సచివాలయ పరిధిలో ఉంటారు. యూరియా కొరతకారణంగా రైతులకు కని పించకుండా అగ్రికల్చర్ అసిస్టెంట్లు తమ ముఖం చాటేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారులు అందజేసిన నివేదికలలో కనీసం 40 శాతం కూడా యూరియా సరఫరా కాలేదని అధికారులు అంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రైతులకు కావాల్సిన యూరియా సిద్ధంగా ఉందని పేర్కొంటోంది. దీంతో పాటు యూరియా వాడకం అరికట్టడానికి అధికారులు , ప్రభుత్వం నానో యూరియాను వాడాలని రైతులకు సూచనలు ఇస్తున్నారు. యూరియాకు అలవాటు పడిన రైతులు తమ పంటలకు యూరియా లభించకపోవడంతో ఆందోళనలో పడ్డారు.

అయిన వారికే అందిస్తున్నారు..



అధికారులు రైతు సేవా కేంద్రాల్లో బయటి నుంచి వచ్చే రైతులకు ఒక్క బస్తా యూరియాను మాత్రమే అందిస్తున్నారు. మిగిలిన బస్తాలను అయిన వారికే ఇస్తున్నారు.. ఇదేమిటని ప్రశ్నిస్తే తగిన సమాధానం చెప్పడం లేదు..

- పి చెంగల్రాయప్ప, రైతు.

గతంలో ఈ పరిస్థితి లేదు..



మూడు, నాలుగు గ్రామాలు కలిపి ఒక్క రైతు సేవా కేంద్రానికి అప్పగిం చారు. ఈ కారణంగా మేము యూరియా కోసం ఎప్పుడు ఇస్తారా? అని గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. మా సొంత కూలి పనులు వదులు కుని వేచి వుండాల్సి వస్తోంది.. గతంలో ఈ పరిస్థితి లేదు..

- పి వెంకటరమణ, రైతు.



రైతు బజారును పరిశీలిస్తున్న ఏఎంసి చైర్మన్ జిఎం రాజు

కృష్ణలంక రైతు బజారు సందర్శన

ప్రజాశక్తి-కుప్పం: విజయవాడ కృష్ణలంక లోని రైతు బజార్‌ను కుప్పం ఏఎంసీ చైర్మన్ జిఎం రాజు సందర్శించారు. కుప్పం మార్కెట్ యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు రైతు బజార్ నిర్వహణకు సంబంధించి విజయవాడలోని కృష్ణలంక రైతు బజారును పరిశీలించినట్లు ఆయన తెలిపారు. కుప్పం ప్రాంత రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కన్నా అధిక మొత్తంలో ధర వచ్చే విధంగా చేసేందుకు అనేక ప్రణాళికలు సిద్ధం చేస్తామని అందులో భాగంగా రైతు బజారును సందర్శించినట్లు ఆయన తెలిపారు.



ఇంజనీర్స్ డేలో పాల్గొన్న బిసిఎన్ విద్యా సంస్థల సిబ్బంది

ఇంజనీర్లు పాత్ర కీలకం: బీసీ నాగరాజ్

ప్రజాశక్తి -కుప్పం: దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర అపారమని నూతన ఆవిష్కరణలతో సాంకేతిక రంగాన్ని ముందుకు నడిపించే శక్తి ఇంజనీర్ల లోనే ఉందని కుప్పం బిసిఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ నాగరాజు పేర్కొన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీరింగ్ డే వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తు న్నారని దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్ బాబు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - యాదమరి, బంగారుపాళెం: చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ లబ్ధిదారులకు సోమవారం సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఇందులో రూ.36,86,156 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే మురళీ మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ సీఎం సహాయనిధి ఆపద సమయంలో పేద ప్రజలకు నిజమైన అండ అని ఆయన పేర్కొన్నారు. డబ్బు లేని కారణంగా ఎవరు వైద్యం లేక ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ సహాయనిధిని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్‌పి ధరణీ నాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గిరిధర్ బాబు, యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, యదమరి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- పలమనేరు: ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ 2025లో విజయం సాధించిన పలువురు అభ్యర్థులు సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్ లో ఎంపికైన పలమనేరు పరిసర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు ఆయనను కలసి సన్మానించారు. జిల్లా వ్యాప్తంగా 50 మంది అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్ కు ఎంపిక కాగా అందులో పలమనేరుకు చెందిన 8 మంది ఉండడం విశేషం. దీంతో వారందరూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ స్థానిక ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారందిరిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మోహనలక్ష్మి, లత, ఉష, పునీత, ఆశ, రంగనాథ్, మస్తాన్, భువనేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్య హక్కు కల్పించేందుకే స్వమిత్ర సర్వే

ప్రజాశక్తి -పెద్దపంజాణి: గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్వమిత్వ సర్వేని ప్రారంభించిందని పెద్దపంజాణి గ్రామ పంచాయతీ కార్యదర్శి లత సోమవారం అన్నారు. మండల కేంద్రంలో గ్రామంలోని ఇండ్లు, ఖాళీ స్థలాలు పరిశీలించి కొలిచి హద్దులు నమోదు చేసి ప్రభుత్వ ఆదేశానుసారం ధ్రువపత్రం కార్డులు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామకంఠంలో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో నివాసం ఉంటున్నా ఇల్లు కట్టుకోవాలని ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన గృహ రుణం పొందేందుకు వాళ్లకు అర్హత లేదని, భూమి వారిదే అయినా దాన్ని ధ్రువీకరించే పత్రాలు లేని పరిస్థితి, స్వమిత్ర సర్వే బృందం సర్వే చేపట్టి వారి భూమికి సంబంధించి సరిహద్దులు, విస్తీర్ణం నిర్ధారించి వారికి యాజమాన్య పత్రం అందించి వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తారని దీంతో లోన్ పెట్టుకునేందుకు వారికి హక్కులు పొందుతారు. ఇటువంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నవారికి ఇప్పుడు స్వమిత్ర ఈ సర్వే బాసటగా నిలుస్తోందన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో ముదరంపల్లి గ్రామ కార్యదర్శి జయశ్రీ, డిజిటల్ అసిస్టెంట్ అఖిల,నిడిగుంట పంచాయతీ కార్యదర్శి మహేంద్ర రెడ్డి,ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి,వెల్ఫేర్ అసిస్టెంట్ బాలాజీ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధుల నివారణ

- పశువులకు టీకాలు
- పాల ఉత్పత్తి తగ్గుదల నిరోధానికి మార్గం
- పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్

ప్రజాశక్తి - పుంగనూరు: గాలి కుంటు వ్యాధుల నివారణే ధ్యేయంగా పశువులకు టీకాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టామని, పశువుల పాల ఉత్పత్తి తగ్గుదల నిరోధానికి ఈ టీకాలే ఉత్తమ మార్గమని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్ అన్నారు. సోమవారం ఆయన పశువుల వ్యాధులకు సంబంధించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాడి పశువులు పలు రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం వుంది. ఇందులో ప్రధానంగా గాలికుంటు వ్యాధి ఒకటి. దీని బారిన పడకుండా ముందస్తు టీకాలు వేసుకోవడమే ఉత్తమమైన మార్గం అని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్ పేర్కొన్నారు. ఆప్తోస్ వైరస్ ద్వారా సోకే ఈ వ్యాధి నివారణకు ఈనెల 15 నుంచి టీకాలు పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ మేరకు మందులు సరఫరా చేసింది. వ్యాధి సోకిన వాటిని చికిత్సతో బాగు చేసినా జీవితాంతం సమస్య ఉంటుందని చెప్పారు. వ్యాధి బారిన పడకముందే టీకా వేసుకోవాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు

గాలి కుంటు వ్యాధి ఆప్తోస్ వైరస్ ద్వారా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువులు పాలు తాగితే దూడలకు వచ్చే అవకాశం వుంది. జబ్బు వచ్చిన పశువుల్లో జ్వరం 103 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. నోటి నుంచి సొంగ కార్చడం నోటిలో అల్సర్లు ఏర్పడడం, నాలుకపై పూత ఊడిపోయి మేతమేయలేక, నెమరు వేయలేక నీరసించి పోతాయి. పాడి పశువులు బలహీనంతో నీరసించి పోయే ప్రమాదం వుంది. కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడి నడవలేక ఇబ్బందులు పడుతుంటాయి.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన వాటిని మంద నుంచి వేరు చేయాలి. పశువులు ఉండే చోట శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. వ్యాధి సోకిన పశువులు నుంచి దూడలకు పాలు తాగించకూడదు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి. పుండ్లు అయితే వైద్యుల సలహాలతో మందులు వాడడంతో పాటు వారి సూచనలు పాటించాలి. వ్యాధి నుంచి కోరుకున్న జీవి తాంతం ఇలాంటి సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. పునరుత్పత్తి సామర్థ్యం తగ్గడం, ఎండకు తాళలేక పోవడం, ఆయాసంతో రొప్పుతూ ఉండడం, పాలు దిగుబడి తగ్గడం, శరీరంపై వెంట్రుకలు పెరగడం, హార్మోన్ల సమతుల్యత లోపించడం వంటి సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి.

వ్యాధి నివారణకు టీ కానే ఉత్తమం



గాలి కుంటు వ్యాధి నివారణకు టీకానే ఉత్తమమైన మార్గమని అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్ తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి అన్ని రకాల పాడి పశువులకు ఏడో విడత గాలికుంటు టీకాలు వేసేందుకు పుంగనూరు నియోజకవర్గానికి అధిక డోసులు వచ్చాయన్నారు. పశువైద్యులు, సహాయకులు, అటెండర్లు, ఇతర సిబ్బంది బృందాలుగా ఏర్పడి రైతు ముంగిటకే వచ్చి సంకరజాతి పాడి పశువులతో పాటు గేదెలకు ఉచితంగా టీకాలు వేయనున్నారు. టీకా వేసిన రోజు నుంచి ఆరు నెలలపాటు పశువులకు వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది. ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం ఆధ్వర్యంలో వేసే టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి సారి టీకా వేసిన దూడలకు 21 రోజుల తర్వాత బూస్టర్ డోస్ వేసుకోవాలన్నారు.



కుప్పంలో 'పెయింట్ ఏ వాల్'

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాల్టీ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై రెండు రోజుల అవగాహనలో భాగంగా సోమవారం పెయింట్ ఏ వాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం, బాలుర ఉన్నత పాఠశాల, ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో ఔత్సాహికులు గోడలపై పెయింటింగ్ వేశారు. పెయింట్ ఏ వాల్ కార్యక్రమంలో భాగంగా యువత వేసిన పెయింటింగ్‌ను ఎమ్మెల్సీ శ్రీకాంత్ పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెండు రోజులపాటు కుప్పం మున్సిపాల్టీ పరిధిలో ఈ కార్యక్రమాన్ని కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. మంగళవారం కుప్పం ప్యాలెస్ వద్ద నుండి ఎమ్మార్‌రెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో యువత స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, సురేష్, వేలు ,జగదీష్, మాజీ ఎంపీపీ వెంకటేష్, యూనిట్ హర్ష, యూనిట్ ఇన్‌చార్జ్ వేణు, రెస్కో డైరెక్టర్ శివ, మహిళ నేతలు శారదమ్మ, నవనీత పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన తులసీనాథ్

ప్రజాశక్తి-కుప్పం: రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని బిజెపి కుప్పం ఇన్‌ఛార్జ్ తులసినాథ్ తిరుపతిలో కలిశారు. తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళ సాధికార సదస్సులో పాల్గొనేందుకు సోమవారం తిరుపతి వచ్చిన ఎంపీ పురందేశ్వరిని బిజెపి చిత్తూరు జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు, కుప్పం ఇన్‌ఛార్జి తులసీనాథ్ కలిశారు. గ్రామీణ స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పురందేశ్వరి సూచించినట్లు ఆయన తెలిపారు.

ఎంపిడివో పెంచల వీరేంద్ర బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - యాదమరి: యాదమరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా పెంచల వీరేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలో డిప్యూటీ ఎంపీడీవో విధులు నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించడంతో యదమరి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని తెలిపారు.



ఉత్సవాలలో సందడి

ప్రజాశక్తి- రామకుప్పం: స్థానిక వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయానికి భక్తులు అధికంగా తరలి వచ్చారు. ఆలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా భాద్రపద మాసంలో నిర్వహించే ఉత్సవాలకు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను ఆలయం చుట్టూ ప్రాకారోత్సవాలు నిర్వహించారు. ఆలయ చుట్టుపక్కల ఉన్న శ్రీ పద్మావతి, వెంకటేశ్వర స్వామి, శనీశ్వర స్వామి, ఆంజనేయస్వామి, వినాయక స్వామి, నాగుల పుట్ట ఆలయాలలో సందడి నెలకొంది. సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ వెంకట మోహన్, ఆలయ నిర్వాహకులతో కలిసి భక్తులకు క్యూలైన్లు, ట్రాఫిక్ నియంత్రణ కృషి చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ వారు భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

రహదార్ల నిర్మాణానికి భూమి పూజ

రూ.3.67 లక్షల వ్యయంతో బిటీ రోడ్డు నిర్మాణం



ఎంపీ, ఎమ్మెల్యేలు రహదారికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని సాంబయ్య కండ్రిక- కట్టమంచి రహదారులను రూ. 3.67 లక్షల వ్యయంతో నిర్మించ నున్నారు. ఈ బిటిరోడ్ల పనులను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు , ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ సోమవారం భూమి పూజ చేసి పను లు ప్రారంభించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అతుకులు, గతుకులమయైన సాంబయ్య కండ్రిగ - కట్టమంచి రహదారి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపామన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఈ అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ బీటీ రోడ్ల నిర్మాణం పూర్తి అయితే చిత్తూరు నగరం నూతన హంగు లను సంతరిం చుకుంటుంద న్నారు. ఎన్నో ఏళ్లుగా నరక యాతన అనుభ విస్తున్న స్థానిక ప్రజలకు ఉపశమనం కలుగు తుం దన్నారు. ఈ కార్యక్ర మంలో చిత్తూరు నగర మేయర్ కుమారి అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చూడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, 5వ డివిజన్ కార్పొరేటర్ హరిణి రెడ్డి, ఎమ్మెల్యే సోదరులు జీవన్ , కార్పొరేటర్ అశోక్, చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



గాలి కుంటు వ్యాధికి టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. మండలంలోని పశువులకు రైతు సేవ కేంద్రాల్లోని పశు సంవర్ధక సహాయకులు వద్ద 16 వేల డోసులు టీకా అందుబాటులో వుందని, పాడి రైతులు నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పని సరిగా టీకా వేయించుకుని పశువులు వ్యాధి బారిన పడకుండా కాపాడాలని కోరారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకా వల్ల దూడలలో మరణాలు నివారించవచ్చని పాడి పశువులలో వ్యాధి రాకుండా నిరోధించి పాల ఉత్పత్తిని కాపాడవచ్చన్నారు. గుడిపల్లి మండలం గుత్తర్లపల్లిలో గుడిపల్లి టిడిపి మండల అధ్యక్షులు బాబునాయుడు ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించి వారి పశువులను వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు.

సిద్ధేశ్వరకొండ గుడి భూములను కాపాడండి

తహశీల్దారుకు వినతి



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: శ్రీ సిద్ధేశ్వర స్వామి కొండ సిద్దేశ్వరస్వామి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి గుడి భూములు కొంతమంది ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారు శ్రీనివాసులుకు మండలంలోని వింజం గ్రామపంచాయతీ ప్రజలు చుట్టుపక్కల ప్రజలు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం లోని వింజం పంచాయతీ సిద్ధేశ్వర కొండ, సుబ్రమణ్యస్వామి లకు కలిసి ఆలయ భూములు సుమారు 70 ఎకరాలు ఉన్నాయి. అయితే ఇటీవల కొంత మంది వ్యక్తులు గుడి భూములను ఆక్రమించారని గుర్తించి వింజం, బాలగంగనపల్లె పంచాయతీలకు చెందిన ప్రజలు హిందూ ధర్మ సంఘం సహకారంతో గంగాధరనెల్లూరులో సుమారు 200 మందితో ర్యాలీ నిర్వహించారు. తర్వాత తహశీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించి 'గుడి భూమిని ఆక్రమణదారుల నుండి కాపాడండి..' అంటూ నినాదాలు చేశారు. గుడికి సంబంధించిన భూములను ఆక్రమణదారుల నుండి కాపాడాలని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, హిందూ ధర్మం సంఘం నాయకులు కలిసి డిమాండు చేశారు.

అధునాతన సౌకర్యాలతో 108 ప్రారంభం

- క్షత గాత్రులు, రోగులకు ఎంతో ఉపయోగం - ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: క్షతగాత్రులు, రోగుల ప్రాణాలను కాపాడడమే ధ్యేయంగా ప్రభుత్వం మంజూరు చేసిన అధునాతన సౌకర్యాలతో కూడిన 108 అంబులెన్స్ ను పలమనేరు శాసనసభ్యుల అమరనాథ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం మరియు భవ్య హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబులెన్స్ వాహనానికి పూజలు నిర్వహించి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆయన.. పలమనేరు నియోజకవర్గం జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయని గుర్తించి రూ. 37 లక్షలతో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు రెండు అధునాతన అంబులెన్సును మంజూరు చేశారన్నారు. ఇందులో అత్యవసర పరికరాలన్నీ కలిగి ఉండడం చేత ప్రాణాపాయం నుంచి క్షతగాత్రులను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. పలమనేరు ఏరియా ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలు వార్డులను ఆయన పరిశీలించి అక్కడ అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నుంచి పలు కేసులు జిల్లా కేంద్రానికి రెఫర్ అవుతున్నట్లు గుర్తించిన ఆయన ఇకపై అలా జరగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ మమతా రాణిని ఆదేశించారు. ఏదైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి తమ కృషి చేస్తామని, రోగులకు ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు,సుధాకర్, వైద్యులు సుబ్రహ్మణ్యం, భవ్య హెల్త్ సర్వీసెస్ నిర్వాహకులు, టిడిపి నాయకులు ఆర్‌విబాలాజీ, ఆల కుప్పం రాజన్న, ఆర్ బి సి కుట్టి, సుబ్రహ్మణ్యం గౌడ్, చాంద్ బాషా, మదన్, శ్రీధర్ బిఆర్‌సి కుమార్, శ్రీనివాసులు, చిన్ని, లోకేష్ ఆచారి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


ఎంపిడివోకు సచివాలయ సిబ్బంది వినతి



ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో లక్ష్మీకాంత్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నోసనల్ ఇంక్రిమెంట్, ప్రమోషన్లు, పని ఒత్తిడి, ఇతర సమస్యలు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింప చేయాలి


ఎమ్మెల్యేకు డీఎస్సీ ఉద్యోగుల వినతి



ప్రజాశక్తి-పలమనేరు: సిపిఎస్ అమలులోకి వచ్చిన 2004 సెప్టెంబర్ కన్నా ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా నియామకమైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ వర్తింపచేయాలని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం మన రాష్ట్రంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, ఇతర విభాగాలలో పని చేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని పలమనేరు నియోజకవర్గం 2003 డీఎస్సీ ఉద్యోగులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ మెమోను ఇప్పటికే 16 రాష్ట్రాలు అమలు పరిచాయని మన రాష్ట్రంలో కూడా 2023వ సంవత్సరంలో ముగ్గురు ఐఏఎస్ ఆఫీసర్లకు వర్తింప చేశారని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళతానని సత్వర న్యాయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గం బాధ్యులు దొర్నాదుల సిద్ధార్థ , జి. గురునాథం, చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్లు కె ఆర్ శ్రీధర్ , రవికుమార్ , సుదర్శనాచారి, మురళి నిరూప,శ్వేత, జరీనా బేగం ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటు పడుతున్న ప్రభుత్వం

గురుపూజోత్సవంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి-పలమనేరు: కూటమి ప్రభుత్వం భవిష్యత్ తరాల అభివృద్ధికి కృషి చేస్తోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన పలమనేరు, గంగవరం మండల ఉపాధ్యాయుల గురు పూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులని భావి తరాలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిదే అన్నారు. అందుకే టిడిపి ప్రభుత్వం ఉపాధ్యాయులకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. టిడిపి హయాం లోనే అధిక శాతం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయిందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తోందన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులతో విద్య ప్రమాణాల పెంపే లక్ష్యంగా ముందుకెళుతోంద న్నారు. స్థానికంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించిన వారిని సన్మానించి జ్ఞాపిక, ధృవ పత్రాలు ఆయన అందించారు. త్వరలో ఉద్యోగ విరమణ చెంద నున్న పలువురు ఉపాధ్యాయులను సైతం ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమాలలో గంగవరం, పలమనేరు ఎంఈఓ లు లీలారాణి, వేణుగోపాల్ రెడ్డి, బాల సుందరం, శ్రీనివాసులతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు తులసీనాథం నాయుడు, లక్ష్మీనారాయణ, సుదర్శన ఆచారి, బాలకృష్ణ, కుబేర్ నాయుడు, సాలెహా, భాస్కర్, టిడిపి నాయకులు రాజన్న, సోమశేఖర్ గౌడ్, నాగరాజు రెడ్డి, గణేష్, గిరిధర్ గోపాల్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి-చౌడేపల్లి: బాలిక అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. చౌడేపల్లి మండలం ఆమినిగుంట పంచాయతీ బూరగుపల్లికి చెందిన సురేష్ కుమార్తె దివ్యశ్రీ (13) ఈనెల 10 న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఇంతవరకు ఆమె ఆచూకీ లభించక పోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పై దాడి కేసులో సంబంధించి నిందితుడు మొగిలి ఈశ్వర్‌కు కోర్టు రిమాండు విధించింది. చిత్తూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఇటీవల డాక్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన విషయంలో సోమవారం సంబంధిత న్యాయస్థానంలో నిందితుడిని హాజరు పరిచి, తదుపరి వారి ఉత్తర్వులు మేరకు చిత్తూరు జిల్లా జైలులో రిమాండ్‌కు తరలించారు.

భారీ దొంగతనం కేసు ఛేదింపు

రూ.40 లక్షల విలువైన బంగారు స్వాధీనం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రాధ బాంగ్లా వీధిలో గత నెల 31న జరిగిన భారీ దొంగతనం కేసును పలమనేరు పోలీసులు సోమవారం ఛేదించి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. స్థానిక రాధబాంగ్లా వీధిలోని రామ్మూర్తి నాయుడి ఇంట్లో సుమారు 540 గ్రాముల బంగారు దొంగతనం చేసిన కాకినాడ జిల్లాకు చెందిన అడపాల వెంకట శివను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఇతనిపై ఇప్పటికే 12 కేసులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో జూనియర్ ఆర్టిస్టు గానూ పనిచేసి, జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి -చౌడేపల్లి: మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ గాండ్లపల్లిలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ చోరీ చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్వామివారి హుండీని పగలగొట్టి నగదును దొంగలించారు. నిత్యం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలతో పాటు ప్రతి ఆదివారం పౌర్ణమి రోజున అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేసి హుండీలో నగదు వేస్తారు. ఈ తంతును గమనిస్తూ వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి నగదును తీసుకెళ్లారు.

ఈగల్ టీం ఆధ్వర్యంలో అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా ఈగల్ టీం సోమవారం సీతన్స్ కాలేజీలో విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో డ్రగ్స్ నిరోధక అవగాహన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటిని నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు. అంతేగాక, డ్రగ్స్ సంబంధిత సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ 1972 ఉపయోగం, అవసరం, గోప్యతకు సంబంధించిన అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు తాలూక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మురగేష్, ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి-శాంతిపురం: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలోని ఆయన స్వగృహంలో టిడిపి అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదాన్ని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా ఇద్దరూ పలు అభివృద్ధి విషయాలపై, కుప్పం లో నిర్మించనున్న ఎయిర్‌పోర్టు విషయంపై చర్చించారని తెలిపారు.

'రెడ్డి కార్పొరేషన్‌కు నూతన కమిటీ వేయాలి'

ప్రజాశక్తి-పలమనేరు : ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆదేశాలమేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ రెడ్డి కార్పొరేషన్ కు నూతన కమిటీ వేయాలని రెడ్డి కార్పొరేషన్ కు 2వేల కోట్లు నిధులు కేటాయించాలని తద్వారా రెడ్డి యువతకు పేద రెడ్డి సోదరులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ పలమనేరు ఆర్‌డివోకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రెడ్డి సంఘం అడ్వైజర్ అమరనాథ రెడ్డి, పలమనేరు రెడ్డి అభ్యుదయ సంక్షేమసంఘం గౌరవ అధ్యక్షులు నాగరాజ రెడ్డి , అధ్యక్షులు జయరామ రెడ్డి, సెక్రటరీ వెంకటముని రెడ్డి, కోశాధికారి మల్లీశ్వర రెడ్డి , ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు వేమా రెడ్డి గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -వి కోట : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావును వీకోట టిడిపి నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. విజయవాడలోని ఆటో నగర్ లో రాష్ట్ర వేర్ హౌస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును, రాష్ట్ర వేర్ హౌస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వి.కోట మండల పార్టీ అధ్యక్షుడు ఏ.ఎం.రంగనాథ్ , ఇతర టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛ అందజేసి శాలువా కప్పి గజమాలతో ఆయనను సన్మానించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని సైతం కలిసి మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలంటూ వారికి వినతిపత్రం సమర్పించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమాకానికి సహకరించిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో తనను నియమించిన పదవిలో బాధ్యతతో ప్రజలకు సేవలు అందిస్తానని రంగనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, నారాయణస్వామి, టిడిపి నాయకులు విశ్వేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైద్య సేవలపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలం తీర్థం పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి శక్తివంతమైన కుటుంబ అభియాన్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఓ, ఆశా వర్కర్లకు ప్రత్యేక అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఇందులో పౌష్టికాహారం ప్రాముఖ్యత, కేన్సర్ పరీక్షలు, మాత సంరక్షణ సేవలు, శిశు సంరక్షణ, వ్యాక్సినేషన్, ఈఎన్టీ సేవలు, డెంటల్ పరీక్షలు, కుటుంబ నియంత్రణపై సలహాలు విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్ఎస్ తిరుమలమ్మ, సిహెచ్‌ఓ లు పాల్గొని మహిళల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై వివరణాత్మకంగా తెలిపారు.